

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – ‘మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?’ అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో ‘పీజీ టు కేజీ’ గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది ‘బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే’లో తొలివిడతగా ‘ఫన్ నేనొక్కడినే’. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (54)

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి - రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గ్‌లో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

### *స్వర్గావరోహణ పర్వం*

ఆప్తులకు, ఆత్మీయులకు కానుకలు వెదకడానికి దుకాణాల్లో తిరుగుతుంటే- మా బడ్జెట్లో కొనడానికి కూడా ఈ దేశంలో ఎన్ని రకాల ఆకర్షణీయమైన వస్తువులు ఉన్నాయోననిపించింది. అక్కడ పాతబడినవే ఎన్నాళ్లు వాడినా మోజు తీరవు అనిపిస్తుంటే- రోజురోజుకీ ఏదో ఒక కొత్త వస్తువు బజార్లోకి వస్తోంది.

అవికాక మేము మా కూడా ఇండియాకి తీసుకుని వెళ్లాల్సిన- మిక్సీ, టేపు రికార్డర్లు వగైరాలకు స్పేర్సు, అనుబంధ పరికరాలు కూడా చాలా ఉన్నాయి.

మాకున్నది ఒక్కటే గది. అందులో ఉన్న ఫర్నిచర్- ఓ మంచం, చిన్న బల్ల, దాని చుట్టూ నాలుగు కుర్చీలు. ఇంకా ఓ మూల తాళమేసిన మూడున్నర అడుగుల ఎత్తు బీరువా. దానిమీదనే టేపు రికార్డర్, పుస్తకాలు, మిక్సీ వగైరాలు పెట్టుకుంటాం.

మేము కొన్న, దాచిన వస్తువుల్ని ఇండియానుంచి తెచ్చుకున్న పెట్టెల్లో కాళీ ఉన్న మేరకు ఉంచాలి. లేదా గదిలోనే ఓ మూలగా ఉంచాలి.

మేము వరుసగా అవీ ఇవీ కొంటుంటే గది నిండిపోతూ గోడౌన్లా తయారౌతోంది. మాకు మసలడానికి ఇబ్బందిగా అనిపించినా పిల్లలు కూడా సహకరించే టైపు కాబట్టి సద్దుకుపోగలుగుతున్నాం. ఇంటికెవరైనా వస్తే- తిరుగు ప్రయాణం హడావుడిలో ఉన్నామని చెప్పొచ్చు కానీ- కొన్నవన్నీ వాళ్లముందు ప్రదర్శించడం ఇష్టంలేక- వాటిని గుట్టగా పోసి పైన దుప్పటినో, చీరనో కప్పుతున్నాం.

ఐతే అన్నింటినీ విమానంలో తీసుకెళ్లడం ఎలా?

అప్పట్లో విమాన ప్రయాణానికి మనిషికి 20 కేజీల లగేజి, హ్యాండ్ లగేజిగా మరో 15 కేజీలు మాత్రమే ఉచితం. అదనపు బరువుకి కిలోకి ఇంత అని తీసుకునే ఛార్జి చాలా ఎక్కువ. నేనిక్కడికి వచ్చేటప్పుడు 13.5 కేజీలతో వచ్చాను. శ్రీమతి వచ్చినప్పుడు పిల్లలతో కలిపి ముగ్గురు మనుషుల లగేజికి అవకాశమున్నా తనూ 20 కేజీల లోపు బరువుతోనే వచ్చింది.

ఇప్పుడు మాకు మొత్తం 80 కేజీలు లగేజిగానూ, 60 కేజీలు హ్యాండ్ లగేజిగానూ తీసుకెళ్లే అవకాశముంది. మేము కూడా తీసుకెళ్లేవీ, కానుకలూ వగైరాలు ఆ పరిమితికి లోబడి ఉండాలి.

ఇంట్లో వెయింగ్ మెషీన్ ఉంది. బరువు అంచనాకి రోజూ అది వాడేవాళ్లం.

"ఈ ప్రయాణం పేరు చెప్పి రోజూ దీని మొహం చూడాల్సి వస్తోంది" అని విసుక్కుంది శ్రీమతి.

ఆ విసుగుకి కారణముంది.

జర్మనీ వచ్చేముందు నా బరువు 48 కేజీలు. శ్రీమతి అంతకంటే బాగా తక్కువ. చాలామంది మమ్మల్ని అండర్‌వెయిట్ దంపతులు అనేవారు.

జర్మనీ వచ్చేక ల్యానబర్గులో నాలుగు నెలలు జర్మన్ భాష నేర్చుకున్నాను కదా- నేనున్న ఇంట్లో వంట సదుపాయం లేక- పాలు, బ్రెడ్-బటర్-జామ్, పళ్లతో సరిపెట్టుకునేవాణ్ణి. ఆ మాత్రానికే నేనక్కడ ఎనిమిది కేజీల బరువు పెరిగాను. నా ఎత్తుకది ఇంకా అండర్‌వెయిటే.

బెర్లిన్ వచ్చేక వెయింగ్ మెషీన్ కొన్నాను. ఇంట్లోనే బరువు చూసుకునే సదుపాయం థ్రిల్లింగ్‌గా అనిపించింది. శ్రీమతి వచ్చేక రోజూ మేము, పిల్లలు బరువులు చూసుకుంటూ థ్రిల్ అయ్యేవాళ్లం. కానీ అది కొన్నాళ్లే!

వచ్చిన మూడు నెలలకి తన బరువు త్వరగా పెరుగుతున్నట్లు శ్రీమతి గుర్తించింది. దాంతో పాలు తాగడం మానేసింది. బ్రెడ్‌కి తను వెన్న రాసుకోవడం మానేసింది. ఈ విషయం నాకు తెలియదు. తెలిసుంటే- చలిదేశంలో అది కూడదని చెప్పి ఉండేవాణ్ణి.

ఏది ఏమైనా శ్రీమతి బరువు ఎప్పుడు చూసుకున్నా, మునుపటికంటే ఎక్కువుండేది. నేనూ పెరుగుతున్నాను కానీ తనంత వేగంగా కాదు.

ఒకప్పుడు బాగా అండర్‌వెయిట్ అనిపించుకున్న నేను కొద్దిగా ఓవర్‌వెయిట్ అయ్యాను. నాకంటే బాగా తక్కువ బరువుండే శ్రీమతి క్రమంగా నన్ను దాటించేసేక తను బరువు చూసుకోవడం మానేసింది.

బరువు పెరగడానికి- థైరాయిడ్ వగైరా ఆరోగ్యసమస్యలు కూడా కారణం కావచ్చని అప్పట్లో మాకు తెలియదు. అందుకని బరువు పెరక్కుండా ఆపడానికి ఆహారంలో ఏం తగ్గించాలో తెలియక చాలా మథనపడేది.

ఒలోముచ్‌కీ బంధువు హెర్ షేరర్- ఆ ఇంట్లో మాతోపాటే వేరే గదిలో ఉంటున్నాడుకదా! అతడు శ్రీమతిని బిడ్డలా ఫీలై ఎంతో ఆత్మీయంగా పలకరించేవాడు. ఒకరోజున అతడు శ్రీమతితో, "నీకు వళ్ళొస్తున్నట్లు అనిపిస్తోంది. శ్రద్ధ తీసుకోకపోతే ఒలోముచ్‌కీలా ఐపోగలవు జాగ్రత్త!" అని హెచ్చరించాడు.

శ్రీమతి స్వతహాగా సరదా మనిషి. తనమీద తనే హాయిగా జోకులేసుకోగలదు.

బరువు పెరక్కుండా ఆపడానికి తను తీసుకుంటున్న జాగ్రత్తలేవీ పనిచెయ్యకపోవడంతో- తన వళ్ళు గురించి దిగులుపడ్డం మానేసింది. ఓ లావుపాటి మనిషిగా తనకి తానే గుర్తింపునిచ్చేసుకుంది.

ఆమె హేరర్ తనకు చేసిన హెచ్చరికని నాకు చెప్పిన విధానమే అందుకు నిదర్శనం.

'ఒలోముచ్‌కీ లా' అన్నప్పుడు- హేరర్ ఆమె లావుని సూచించడానికి రెండు చేతుల్నీ ఎలా కదిపాడో- అభినయించి చూపింది. సినిమాలో ఒక హాస్య సన్నివేశాన్ని మిత్రులతో పంచుకునే ఉత్సాహమే తప్ప- అప్పుడామెలో ఏమాత్రం ఉక్రోషం కనబడలేదు నాకు.

బరువు చూసుకోవడం మానేసేక వెయింగ్ మెషీన్ని తాకడానికి కూడా ఇష్టపడేది కాదు శ్రీమతి. అదేమంటే దాన్ని తాకితేనే తన బరువు పెరిగిపోయిన అనుభూతి కలుగుతోందనేదామె. ఎందుకంటే- తన బరువు పెరగడానికి మరో కారణం దొరకడంలేదు.

దాంతో పిల్లల బరువు చూడాలన్నా, అది నేనే చూడాలి తప్ప- తనా మిషన్ని తాకేది కాదు.

చిత్రమేమిటంటే- మేమిద్దరం అలా అలా బరువు పెరుగుతుంటే పిల్లల బరువు మాత్రం మారేది కాదు. ఏడాదిలో ఇద్దరూ తలో కేజీయో, కీజీన్నరో పెరిగారో ఏమో!

ఎదుగుతున్న పిల్లలు బరువు పెరగరేమనిపించినా- చూడ్డానికి మిసమిసలాడుతూ, ఎప్పుడూ హుషారుగా కనిపిస్తూ, నవ్వుతూ తుళ్ళుతూ ఉండడంవల్ల మనసు కలవరపడలేదు.

ఇప్పుడు సామాన్ల బరువు చూడ్డానికి శ్రీమతికా మెషీన్ని పదేపదే తాకడం తప్పనిసరయింది. అలా తాకినప్పుడు రోజుకోసారైనా విసుక్కోవడమూ తనకి మామూలయింది.

ఇక సామాను సర్దడానికి- ఇండియానుంచి నేను తెచ్చుకున్న సూట్‌కేస్ పాడయింది. సరుకులు ఉంచడానికే తప్ప మొయ్యడానికి పనికిరాదు. శ్రీమతి తెచ్చింది కొంత ఫరవాలేదు కానీ- ఇప్పటికే అది మా బట్టలు వగైరాలలతో సగానికి పైగా నిండింది.

సామాను సర్దడానికి మూడు సూట్‌కేసులు కొన్నాం. వాటిలో సర్దుతున్నప్పుడు అర్థమయింది- అంత సామానూ ఇండియా తీసుకెళ్లడం మావల్లకాదని. ఐతే అక్కడ వాడినవాటితో సహా ఏదీ వదలడానికి మనసొప్పలేదు.

ఆ విషయమై పదిమందినీ వాకబు చేసేక చాలా విషయాలు తెలిశాయి.

పోస్టాఫీసు ద్వారా కొన్ని సామాన్లు సీమెయిల్లోనూ, కొన్నింటిని ఎయిర్ మెయిల్లోనూ పంపొచ్చు. ఎయిర్ మెయిలుకి చార్జి ఎక్కువే కానీ త్వరగా చేరుతుంది, మంచి కండిషన్లో చేరుతుంది. కాబట్టి- విలువైనవీ, తేలికైనవీ ఎయిర్ మెయిల్లో పంపొచ్చు.

సీమెయిల్ కారు చౌక. కానీ ఎప్పటికి చేరుతుందో, అందులోని వస్తువులు ఏ కండిషన్లో ఉంటాయో చెప్పడం కష్టం. కాబట్టి పోయినా ఫరవాలేదనుకున్నవాటినే సీమెయిల్లో పంపాలి.

అప్పటికి మేము వాస్తవానికి వచ్చాం.

సీమెయిల్ కోసం సంచులు తెచ్చి ప్యాక్ చేస్తున్నప్పుడు- పాడైపోయిన ఫ్యూజులు, చెప్పులు లాంటివి ఇండియా తీసుకెళ్లడం అవసరమా అన్న ఆలోచన కలిగింది. జర్మనీలో వాడినవి అన్న స్మృతి తప్పితే వాటికి ప్రాముఖ్యం లేదు. వాటిని పక్కన పెట్టాం.

ఇంకా ప్లాస్టిక్ సంచులు, డబ్బాలు వగైరాలపై మమకారాన్ని కూడా చంపుకున్నాం.

మా ఆలోచనల్లో ఎంత మార్పొచ్చిందంటే- కొన్నవాటిలో అపురూపమైనవిగా భావిస్తున్న కొన్ని ఐటమ్సుని కూడా సీమెయిల్లోనే పంపాలని నిర్ణయించాం. మచ్చుకి కాసెట్టే టేపులు. ఇతరులకివ్వాల్సినవి కాక- ఒకటా రెండా, మాకోసం పట్టుకెడుతున్నవే వందకి పైగా ఉన్నాయి.

సీమెయిల్కని తయారుచేసిన పార్సెల్సు ఎత్తు నాలో సగముండేది. తీసుకెళ్లడానికి స్వంతంగా కారు లేదు. మిత్రుల్ని అడగాలన్నా, ఒక్క ట్రిప్పు చాలదు. అందుకని మా పాట్లు మేమే పడాలనుకున్నాం.

పాశ్చాత్య దేశాల్లో ఎవర్నీ ఎవరూ పెద్దగా పట్టించుకోరు. మోయగలిగిన సంచులు మోస్తూ రోడ్డుమీద నడుచుకుంటూ పోవడం- ఇక్కడ చిన్నతనం కాదు. కూలీల అవసరం లేదు.

ఇండియాలో ఐతే బరువు భుజంమీద పెట్టుకుని రోడ్డుమీద నడిచేది కూలీలు మాత్రమే.

మా సీమెయిల్ పార్సెల్సు బరువు ఎయిర్ మెయిల్కి ఖరీదు ఎక్కువ కావచ్చు కానీ- మోయడానికి తక్కువే. నేనైతే నాలుగైదు కేజీల బరువుని అవలీలగా మోసెయ్యగలను.

మా ఇంటికి పోస్టాఫీసు ఎంతో దూరం లేదు. కిలోమీటరుకి అటో ఇటో ఉంటుందేమో!

భువనేశ్వర్లో పిల్లలిద్దర్నీ ఎత్తుకుని కూడా మూడు కిలోమీటర్లంటే నల్లేరుపై బండి నడకలా భావించే మాకా బరువు లెక్కలోది కాదు.

నలుగురం కలిసి బయల్దేరేవాళ్లం. మనదేశపు మనస్తత్వాన్ని వదులుకోలేక- నేను సంచిని భుజానికెత్తుకునేవాణ్ణి కాదు. రెండు చేతులూ చాచి- ఉత్తరాదివాళ్లు మిత్రుల్ని ఆత్మీయంగా కౌగలించుకున్నట్లు పట్టుకునేవాణ్ణి.

మొదటి పార్సెల్ పంపేక చాలావరకూ అదనపు సామాను సీమెయిల్లో పంపడమే ఉత్తమం అనిపించింది.

కూడా తీసుకెళ్లాల్సిన వాటిలో- మాది కానిది- నటరాజన్ ఇచ్చిన ఎలక్ట్రికల్ టైపు రైటర్ ఒకటుంది.

నటరాజన్ ఫెలోషిప్ ఎక్స్టెన్షన్ తీసుకోలేదు. నాకంటే మూడు నెలలు ముందే అతడి ప్రయాణం.

అతడు టైపింగులో ఎక్స్పర్ట్. టైప్ మెషీన్ ఎక్కువగా వాడతాడు. ఎలక్ట్రికల్ టైప్ రైటర్ చూసి, నేను టేప్ రికార్డర్ చూసినప్పటికంటే ఎక్కువ థ్రిల్లయ్యాడు. అది కొనుక్కోవాలని మనసు. కానీ-

"నేను ఒక్కణ్ణి. ఎక్కువ సామాను తీసుకెళ్లలేను. టికెట్లు నాలుగు కాబట్టి- నీకు వీలవుతుందేమో చెప్పు. కొని- బెర్లిన్ వచ్చినప్పుడు మీ ఇంట్లో వదిలి వెడతాను. మొహమాట పడకు. ఇక్కడికొచ్చేక నీకంటే క్లోజయిన మిత్రులే- ఫ్యామిలీతో ఇండియా వెడుతూ- ఈ ఐటం తీసుకెళ్లడం మావల్ల కాదన్నారు. కాబట్టి నీకు కుదరదన్నా నేనేమనుకోను" అని ఉత్తరం రాశాడతడు.

అప్పటికి లగేజి గురించిన అవగాహన నాకంతగా లేదు. మారాలోచన లేకుండా ఒప్పుకున్నాను.

నేను ఒప్పుకున్నాననే అతడా టైపురైటర్ కొన్నాడు. నాకు తెచ్చిచ్చినప్పుడు, "నువ్వు చేస్తున్నది చాలా గొప్ప త్యాగం. ఒక మంచి మిత్రుడిగా నిన్ను జీవితకాలం గుర్తుంచుకుంటాను" అన్నాడు.

ఇంత చిన్న విషయానికి మరీ అంత పెద్ద పొగడ్తా అనుకున్నాను. అందులోనూ జర్మన్ లాంగ్వేజి నేర్చుకుంటున్నప్పుడు అనేక ఆదివారాలు అతడిచ్చిన ఆతిథ్యం సామాన్యమైనదా? మాటవరసకి కూడా అతడా ప్రసక్తి తేడు.

నటరాజన్ ముక్కు సూటి మనిషి. టైపురైటరుకి కస్టమ్స్ డ్యూటీ పడుతుందని, దగ్గిరుంచమని నాకు 150 మార్కులు ఇవ్వబోయాడు.

"డ్యూటీ పడొచ్చు, పడకపోవచ్చు. అవన్నీ ఇండియాలో చూసుకుందాంలే" అన్నాను.

"సకుటుంబంగా ఉంటున్నావు. నీవద్ద ఎంతో డబ్బుండదు. నాకు డబ్బులు బాగానే మిగిలాయి. నువ్విది తీసుకెళ్లడమే మహోపకారం. ఇంకా డ్యూటీ బాధ్యత కూడా ఇవ్వలేను. ఒకవేళ డ్యూటీ పడకపోతే- అదంతా తర్వాత ఇండియాలో చూసుకుందాంలే. ప్రస్తుతానికి నీకివి అక్కరకొస్తే వాడుకోవచ్చు కూడా" అంటూ బలవంతాన డబ్బు నాకిచ్చి వెళ్లాడు.

ఇప్పుడు సద్దుళ్లకు ఆ ఐటమ్ నాకు కాస్త ఇబ్బందిగానే మారింది.

ఆ టైపురైటర్ చిన్న బ్రీఫ్ కేసులా ఉంది. పెట్టెలో పెడితే చాలా చోటు ఆక్రమిస్తుంది.

అదీకాక మాకున్న గ్రుండిగ్ స్టీరియో టేపు రికార్డరు సైజు కూడా ఇంచుమించు అదే. ఎటొచ్చీ చూడ్డానికది బ్రీఫ్‌కేసులా ఉండదు. పెట్టెలో టైపురైటర్ కంటే తక్కువ చోటు తీసుకుంటుంది.

హాండ్ లగేజి 15 కేజీలు ఉండొచ్చు. టైపురైటర్ ఆలోపే ఉంటుంది కాబట్టి- దాన్ని హాండ్ లగేజిగా తీసుకెళ్లొచ్చనుకున్నాం.

"అందువల్ల మరో లాభం. చూడ్డానికిది బ్రీఫ్‌కేసులా ఉంది కాబట్టి- కస్టమ్సు వాళ్లు డ్యూటీ వెయ్యకపోవచ్చు" అంది శ్రీమతి.

"ఔనౌను" అంటూ నేనూ సంబరపడ్డాను.

అప్పటికి మాకింకా కస్టమ్సు వారి 'శోధన పరాక్రమం' గురించి తెలియదనడానికి- మా సంబరాలే నిదర్శనం.

మళ్లీ మా సీమెయిల్ కార్యక్రమానికొస్తే-

శనివారం పోస్టాఫీసు పనిచేస్తుంది. ఆఫీసుకి సెలవు. కాబట్టి పోస్టాఫీసుకి శనివారాలు వెళ్లేవాళ్లం.

మొత్తం ఐదు పార్సెలయ్యాయి. పార్సెల్ పార్సెల్‌కీ మాకు జ్ఞానం, అనుభవం, పరిణతి, వాస్తవంపట్ల అవగాహన పెరుగుతూ వచ్చాయి.

మొదటి పార్సెల్ అయ్యేసరికి మావద్దనున్న సామానులో చెత్తకు చేరాల్సినవి పెరుగుతూ, చెంతనుండాల్సినవి తరుగుతూ వచ్చాయి.

నాలుగు పార్సెల్సు అయ్యేసరికి, మా సామాను మేము కొన్న పెట్టెల్లో ఇముడుతుందన్న ధైర్యం వచ్చింది.

జర్మనీలో ప్రొసీజర్సు సింపుల్. కస్టమర్-ఫ్రెండ్లీ.

మొదటి పార్సెల్ పంపగానే- హమ్మయ్య అని నిట్టూర్చినా- రెండో పార్సెల్ పంపేక మూడో పార్సెల్ పంపడానికి ఉత్సాహం పుట్టింది.

ఒకో పార్సెల్ పంపడం ఐపోతుంటే- ఈ పని ఐపోతే- శనివారం తోచేదెలా అనిపించే స్థితికి చేరుకున్నాం.

ఐతే చివరిదైన ఐదవ పార్సెల్ సమయంలో ఒక దురదృష్టకర సంఘటన  జరిగింది.

అ రోజుపోస్టాఫీసుకి ఒక జర్మన్ వనిత తన పెంపుడు కుక్కతో వచ్చింది.

బొచ్చుకుక్క. చిన్నపిల్ల. పిల్లలు కూడా చేతుల్లోకి తీసుకుని ఆడించేంత చిన్నది.

మా పిల్లలు అటూ ఇటూ చూడ్డంలో బిజీ ఐపోయి కుక్కపిల్లని చూడలేదు.

చూడముచ్చటగా ఉందని నేనే చూపించాను.

వాళ్ళు కుతూహలంగా దాన్ని చూశారు.

కుక్కపిల్ల వాళ్ళని చూసింది. ఉత్సాహంగా మొరిగింది.

నాలుగైదేళ్ల వయసున్న భారీ కుక్కలది కూడా చిన్నపిల్లల మనస్తత్వం అంటారు. పెద్దవాళ్ళు వాటిని చిన్నపిల్లల్లా ముద్దు చెయ్యాలి. చిన్నపిల్లలు వాటితో ఆడుకోవాలి.

ఈ కుక్కపిల్లని చూస్తుంటే ఏడాది నిండిందనిపించదు.

దానికి మెడలో గొలుసు లేదు. చటుక్కున అది పిల్లలమీదికి వచ్చింది.

వచ్చింది అనడంకంటే ఉరికిందనడం సబబు.

బాబు హడిలిపోయి రెండడుగులు వెనక్కేసి తల్లి వెనుక దాక్కున్నాడు.

“భయపడకు. అది పెంపుడు కుక్క. నిన్నేమీ చెయ్యదు” అన్నాను.

పాప కూడా భయపడింది. కానీ నా మాటలు విని మేకపోతు గాంభీర్యంతో అక్కడే నిలబడింది. ఐతే ఉరికిన కుక్కపిల్ల వేగంగా తనవైపు వస్తుంటే- ఆ గాంభీర్యం కొంత సడలింది. ఐనా నేను పక్కనే ఉన్నానన్న ధైర్యంతో- దాన్ని పొమ్మన్నట్లు చేయి విదిలించి సైగ చేసింది.

ఇంకా ముందుకు వస్తుంటే- ‘పో పో’ అంది గట్టిగా.

కుక్కపిల్లకి ఏమర్థమయిందో- అది చటుక్కున పాపమీదకి ఉరికి కాలు పట్టుకుంది.

అలా జరుగుతుందని నేను ఊహించలేదు. కంగారు పడ్డాను.

పాప భయపడిపోయి బ్యారుమంది.

ఆ ఏడుపు విన్న కుక్కపిల్ల స్వంతదారు- జర్మన్ వనిత చటుక్కున- “నైన్ నైన్” అని కుక్కపిల్లని హెచ్చు స్వరంలోనే మందలించింది.

కుక్కపిల్ల పాప కాలు వదిలింది కానీ, ఇంకా అక్కణ్ణించి కదలకుండా పాపనే చూస్తోంది.

పాప భయంగా నా కాళ్లు గట్టిగా పట్టుకుంది.

జర్మన్ వనిత మరింత గట్టిగా కుక్కపిల్లని పిలిచింది.

అప్పుడు కుక్కపిల్ల యజమానురాల్ని చూసింది. ఆమె కళ్లలో హెచ్చరిక అర్థమైనట్లుంది- ఆమెవైపు మళ్లింది.

జర్మన్ వనిత పాపను సమీపించి, బుగ్గలు నొక్కి, "భయపడ్డావా?" అంది ముచ్చటగా. తర్వాత నావైపు తిరిగి సారీ చెప్పింది.

"కుక్కపిల్ల మెడలో గొలుసు లేదు" అని చెప్పానామెకి.

అమె నవ్వి, "పాపని చూసి ముద్దు పడిందంతే! కరిచే టైపు కాదు" అనేసి అక్కణ్ణించి వెళ్లిపోయింది.

"మీదకొచ్చింది. పిల్లల్ని బెదరగొట్టింది. చిన్నపిల్ల కాలు పట్టుకుంది. ఏమయిందో కూడా చూడకుండా- సారీ చెప్పి వెళ్లిపోతుందేమిటీ!" అంది శ్రీమతి విసుగులో కోపాన్ని మేళవించి.

నాదీ సేమ్ ఫీలింగ్. ఐతే- 'ఏమయిందో చూడకుండా' అన్న శ్రీమతి మాటకు స్పందించాను.

అప్పటికి పాప తన కాలునే చూసుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఎందుకు ఏడుస్తోంది? కుక్కగానీ కరిచిందా?

పాప దళసరి ఉన్ని పంట్లాం వేసుకుంది. కుక్క కాలు పట్టుకున్నా దాని పళ్లు పంట్లాంలోంచీ కిందకు దిగవని నా నమ్మకం.

మరి పాప ఎందుకేడుస్తోందీ అనుకుంటూ అక్కడే చతికిలబడి పాపని ఒళ్లోకి తీసుకున్నాను. మాటలతో ఓదార్చుతూ- దానికి తెలియకుండా- ఏ కాలునైతే కుక్కపిల్ల పట్టుకుందో- ఆ కాలు వద్ద పంట్లాం అడుగునుంచీ వెనక్కి మడిచి చూసి ఉలిక్కిపడ్డాను.

కుక్కపిల్లవి రెండు పళ్ల గుర్తులు ఉన్నాయి కాలుమీద. అంటే పాపని కుక్క కరిచింది.

గుండె ఆగినంత పనయింది.

కుక్క కాటు అంటే మాటలు కాదు. బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు చేయించాలి. పాప ఆ బాధకి ఓర్వగలదా అన్న వ్యథ ఒకటి!

బాబుకి చెయ్యి విరిగినప్పుడు హాస్పిటలుకి సంబంధించిన పూర్తి బాధ్యతని రావుగారు తీసుకున్నారు.

అంతకుముందూ ఆతర్వాతా కూడా- మాకు మేముగా హాస్పిటలుకి వెళ్లాల్సిన అవసరం పడలేదు. ఇప్పుడు మళ్లీ రావుగార్ని ఇబ్బంది పెట్టాలా అన్న సంకోచం...

నేనిలా ఆలోచిస్తుంటే శ్రీమతి పాప కాలును పరీక్షగా చూసి, 'కుక్క కరిచినట్లు లేదు. కాలుని కాస్త గట్టిగా పట్టుకున్నట్లుంది. ఆ ఒత్తిడికి కాలుమీద పళ్ల గుర్తులు పడ్డాయి. ఎక్కడా రక్తం లేదు. ఆ సొట్టలు కాసేపట్లో పోతాయి" అంది.

అమృతోపమానమైన మాటలవి!

ఆ మాటలు నాకు ఉపశమనం కలిగించగా నేను కూడా పరీక్షగా చూస్తే తను చెప్పింది నిజమేననిపించింది.

"ఐనా అది పెంపుడుకుక్క. అదీ తెల్లవాళ్ల పెంపుడుకుక్క. తప్పకుండా దానికి రెగ్యులర్‌గా యాంటీ రేబీస్ ఇంజక్షన్ను చేయిస్తుంటారు. మన సంగతి అటుంచు. ఇంట్లోవాళ్లని ముద్దుగా కరిస్తే- వాళ్లకీ ప్రమాదమే కదా!" అన్నాను.

నాకు నేను సద్దిచెప్పుకుంటున్నానో శ్రీమతికి ధైర్యం చెబుతున్నానో తెలియదు.

నా మాటలకు శ్రీమతి మొహం మరింత వికసించింది.

పాప జడుసుకుంది. ఇంటికెళ్లేక కూడా మామూలు మనిషి కావడానికి కాసేపు పట్టింది.

చిన్నపిల్ల. దానికి మా మనసులో భయం తెలియదు.

రాత్రి పడుకునేముందు దాని కాలు మరొక్కసారి చెక్ చేశాం.

కాలిమీద కుక్కపిల్ల పళ్ల గుర్తులు మాయమయ్యాయి. ఎక్కడ కరిచిందో కూడా చెప్పలేం!

తర్వాత పాప నిద్రపోయినా-మా ఇద్దరికీ కూడా ఓపట్టాన నిద్ర పట్టలేదు.

కలత నిద్రలో మెలకువ వచ్చినప్పుడల్లా పాపను ముట్టుకుని చూస్తున్నాం.

తెల్లవారింది. పాపకు జ్వరం రాలేదు.

మెలకువొచ్చేక నిన్న జరిగిన విషయమే మర్చిపోయి- ఎప్పటిలా హుషారుగా ఉంది. తమ్ముడితో ఆటల్లో పడింది.

'హమ్మయ్య' అనుకున్నాం.

ఏ విషయంలోనైనా అమితోత్సాహం పనికిరాదు. కానీ నేను-

ఆ మర్నాడు సోమవారం ఆఫీసుకెళ్లేక యథాలాపంగా అన్నట్లు కుక్కకాటు గురించి వాకబు చేశాను.

రేబీస్‌కి ఇంక్యుబేషన్ పీరియడ్ ఉంటుందిట. అది ఒకరోజునుంచి ఏడాది దాకా ఉంటుందిట.

ఒకోసారి జీవితకాలంలో ఎప్పుడైనా బయటపడొచ్చుట.

ఈ వివరాలు తెలుసుకోవడం- కొరివితో తల గోక్కునట్లయింది.

పాపకి ఇంజక్షన్లు చేయించడం సేఫ్ అనిపించినా- అవసరం లేకుండా ఉత్తపుణ్యాన ఇంజక్షన్లు చేయించడం సబబు కాదనిపించింది.

చిన్నప్పుడు రామాయణ పురాణశ్రవణానికి వెళ్లినప్పుడు- శాస్త్రిగారు చెప్పారు, 'మనిషికి జీవితం వడ్డించిన విస్తరి కాకూడదు. ఎక్కణ్ణించో ఏదో ప్రమాదం పొంచి ఉన్నదన్న భీతి ఎప్పుడూ మనసులో ఉండాలి. ఆ భీతి ఒక భ్రమ అన్న ధైర్యంతో జీవించాలి. రాముడైనా, లక్ష్మణుడైనా, సీత ఐనా, హనుమంతుడైనా- అలాగే జీవించి ధన్యులయ్యారు' అని.

ఆ మాటలిప్పుడు గుర్తొచ్చాయి. నా భీతిని భ్రమగా గుర్తించాను.

'పాపని కుక్క కరవనేలేదు. కరిచినా దాని కాటు ప్రమాదకరం కాదు' అని మనసుకి కాస్త గట్టిగానే సద్దిచెప్పాను.

నేను రేబీస్ ఇంక్యుబేషన్ పీరియడ్ విషయం శ్రీమతికి చెప్పలేదు- అనుమానబీజాన్ని ఆమెలోనూ నాటడం ఇష్టంలేక!

ఆ భీతి ఏమాత్రం లేని శ్రీమతి ధైర్యమే నాకిప్పుడు ఆలంబన!

స్వర్గావరోహణంలో మరికొన్ని ముచ్చట్లు వచ్చే నెల...

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments